24 మంది సజీవదహనం

అవామీ లీగ్ నేత హోటల్‌కు నిప్పు పెట్టడంతో ఘోరం

అల్లర్లలో ఇప్పటివరకు 440 మందికి పైగా మృతి

ఢాకా, ఆగస్టు 6: రాజకీయ సంక్షోభంలో చిక్కుకున్న బంగ్లాదేశ్‌లో అరాచక శక్తులు పేట్రేగిపోతున్నాయి. దేశవ్యాప్తంగా బీభత్సం సృష్టిస్తున్నాయి. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ నేతలపై ఆందోళనకారులు దాడులకు తెగబడుతున్నారు. వారి ఇండ్లు, వ్యాపారాలను ధ్వంసం చేస్తున్నారు. జోహోర్ జిల్లాలో అవామీ లీగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షహిన్ చక్లదర్‌కు చెందిన జబీర్ ఇంటర్నేషన్ హోటల్‌కు సోమవారం రాత్రి అల్లరిమూక నిప్పు అంటించింది. ఈ ఘటనలో 24 మంది సజీవ దహనమయ్యారు. మృతుల్లో ఇండోనేషియాకు చెందిన ఒక వ్యక్తి కూడా ఉన్నారు. పలువురు హోటల్ సిబ్బంది తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. హోటల్ శిథిలాల్లో మరిన్ని మృతదేహాలు లభించే అవకాశం ఉందని సిబ్బంది చెప్తున్నారు.

440కు చేరిన మృతుల సంఖ్య

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారగా, ఇప్పటివరకు 440 మంది మరణించారు. ఆదివారం, సోమవారం చెలరేగిన హింసతో ఎక్కువ ప్రాణనష్టం జరిగింది. పోలీసులు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో దాదాపు 250 మందికి పైగా మరణించినట్టు స్థానిక మీడియా పేర్కొన్నది. సోమవారం హసీనా రాజీనామా తర్వాత అల్లర్లు మరోరూపం దాల్చాయి. అప్పటివరకు పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య గొడవలు జరగగా.. హసీనా రాజీనామా తర్వాత ఆందోళనకారులు అవామీ లీగ్ పార్టీకి చెందిన నేతలను లక్ష్యంగా చేసుకున్నారు.

బంగ్లా సంక్షోభంలో పాక్, చైనా పాత్ర ?

హసీనాను గద్దె దింపి బీఎన్‌పీని అధికారంలోకి తేవడమే లక్ష్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో సంక్షోభం వెనుక పాకిస్థాన్, చైనా పాత్ర ఉందని బంగ్లాదేశ్ ఇంటెలిజెన్స్ అధికారులు భావిస్తున్నారు. షేక్ హసీనాను గద్దె దించి, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ)ని అధికారంలోకి తేవడానికి ఐఎస్ఐ సహకారంతో లండన్‌లో ప్రణాళిక రచించినట్టు చెబుతున్నారు. ఈ మేరకు బీఎన్‌పీ అధ్యక్షురాలు ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ ఐఎస్ఐ అధికారులను కలిసినట్టు ఆధారాలు ఉన్నాయని అంటున్నారు. గత కొన్ని రోజులుగా బంగ్లాలో అల్లర్లను ప్రేరేపించేలా, షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పాకిస్థాన్‌కు చెందిన అకౌంట్ల నుంచి పోస్టులు పెడుతున్నట్టు గుర్తించారు. బంగ్లాలో ఆందోళనలను ప్రేరేపించడంలో ఐఎస్ఐ ద్వారా చైనా కూడా కీలక పాత్ర పోషించిందని భావిస్తున్నారు. ఆందోళనల్లో కీలకంగా వ్యవహరించిన జమాతే ఇస్లామీ బంగ్లాదేశ్‌కు చెందిన విద్యార్థి విభాగం ఇస్లామీ ఛత్ర శిబిర్(ఐసీఎస్) వెనుక ఐఎస్ఐ ఉందని అనుమానిస్తున్నారు. కాగా, షేక్ హసీనా భారత్ అనుకూల వ్యక్తిగా గుర్తింపు పొందగా, ఖలీదా జియా మాత్రం చైనా, పాక్‌కు అనుకూలంగా ఉంటారనే పేరుంది.

యూనస్‌కు బంగ్లా పగ్గాలు

- తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నోబెల్ గ్రహీత
- యూనస్ పేరు ప్రతిపాదించిన విద్యార్థులు
- ఆమోదం తెలిపిన దేశ అధ్యక్షుడు షహబుద్దిన్
- బంగ్లా రాజకీయ సంక్షోభానికి తాత్కాలిక తెర

ఢాకా, ఆగస్టు 6: షేక్ హసీనా రాజీనామాతో బంగ్లాదేశ్‌లో మొదలైన రాజకీయ సంక్షోభం తాత్కాలికంగా కొలిక్కి వచ్చింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నోబెల్ అవార్డు గ్రహీత మహమ్మద్ యూనస్‌ను నియమిస్తూ దేశ అధ్యక్షుడు షహబుద్దిన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్ధరాత్రి అధ్యక్షుడి ప్రెస్ సెక్రటరీ ప్రకటన చేశారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన 'స్టూడెంట్స్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్' ప్రతినిధులు మహమ్మద్ యూనస్ పేరును కొత్త ప్రభుత్వాధినేతగా ప్రతిపాదించారు. దేశంలో సైనిక పాలనను, సైనిక మద్దతు ఉండే ప్రభుత్వాన్ని, నియంత పాలనను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని 'స్టూడెంట్స్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్' జాతీయ సమన్వయకర్త నహీద్ ఇస్లాం మంగళవారం ప్రకటించారు. విద్యార్థులు ప్రతిపాదించిన ప్రభుత్వం కాకుండా వేరే ప్రభుత్వ ఏర్పాటుకు అంగీకరించబోమని ఆయన స్పష్టం చేశారు.

యూనస్ వైపు విద్యార్థుల మొగ్గు

ఆర్థికవేత్త మహమ్మద్ యూనస్(84) సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విద్యార్థి నేతలు మంగళవారం డిమాండ్ చేశారు. తాము యూనస్‌తో మాట్లాడామని, ప్రభుత్వాన్ని నడిపించేందుకు ఆయన అంగీకరించారని విద్యార్థి నేత నహీద్ ఇస్లాం ప్రకటించారు. ప్రస్తుతం యూనస్ విదేశాల్లో ఉన్నారు. యూనస్‌కు పాలన అందించేందుకు సైన్యాధ్యక్షుడు ఉజ్జమాన్ అంగీకరిస్తారా అనే అనుమానం మొదట తలెత్తింది. ఒకవేళ అంగీకరించకపోతే ప్రభుత్వ ఏర్పాటుపై విద్యార్థులు, సైన్యం మధ్య పేచీ మొదలవుతుందని అంతా అనుకున్నారు. అయితే, ఈ అవకాశం ఇవ్వకుండా మహమ్మద్ యూనస్‌నే తాత్కాలిక ప్రభుత్వాధినేతగా దేశాధ్యక్షుడు ఎంపిక చేశారు.

బంగ్లా పార్లమెంటు రద్దు

బంగ్లాదేశ్ పార్లమెంటు(జాతీయ సంసద్)ను రద్దు చేస్తున్నట్టు దేశ అధ్యక్షుడు షహబుద్దిన్ మంగళవారం ప్రకటించారు. హసీనా రాజీనామా అనంతర పరిణామాలపై సోమవారం రాత్రి ఆయన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధినేతలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి ఉద్యమ నేతలతో సమావేశమై చర్చించారు. తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు షహాబుద్దిన్ అనుమతి తెలిపారు. మళ్లీ ఎన్నికలు జరిపేందుకు వీలుగా పార్లమెంటును రద్దు చేస్తున్నట్టు చెప్పారు.

భయం గుప్పిట బంగ్లా హిందువులు

షేక్ హసీనా రాజీనామా తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులను అల్లరిమూకలు లక్ష్యంగా చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా 27 జిల్లాల్లో సోమవారం హిందువుల ఇండ్లు, వ్యాపారాలపై మూకలు దాడికి పాల్పడి, లూటీ చేసినట్టు స్థానిక మీడియా తెలిపింది. అనేక హిందూ ఆలయాలపై దాడులు జరిగాయి. మెహెర్‌పూర్‌లోని ఇస్కాన్ ఆలయం, కాళీ మాత ఆలయానికి దుండగులు నిప్పు పెట్టారు. ఇస్కాన్ ఆలయానికి నిప్పుపెట్టినప్పుడు అక్కడ ఉన్న ముగ్గురు భక్తులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని ఇస్కాన్ అధికార ప్రతినిధి యుధిష్ఠిర్ గోవిందదాస్ తెలిపారు. రంగ్‌పూర్ నగర కార్పొరేషన్‌లో కౌన్సిలర్‌గా ఉన్న హరధన్ రాయ్‌ను దుండగులు హత్య చేశారు. దేశవ్యాప్తంగా హిందువులకు చెందిన 54 ఆలయాలు, ఇండ్లు, ఆస్తులపై దాడులు జరిగాయని బంగ్లాదేశ్ హిందూ బుద్ధిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ తెలిపింది.

బెంగాల్‌కు కోటి మంది

హిందువులు: సువేందు అధికారి

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతుండటంతో, హసీనా రాజీనామాతో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ, జమాతే ఇస్లామీ బలపడే అవకాశం ఉండటంతో పెద్ద ఎత్తున హిందువులు భారత్‌కు శరణార్థులుగా వచ్చే అవకాశం ఉంది. బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అదుపులోకి రాకపోతే కోటి మంది బంగ్లాదేశీ హిందువులు బెంగాల్‌కు వచ్చే అవకాశం ఉందని, వారికి ఆశ్రయం ఇచ్చేందుకు మానసికంగా సిద్ధంగా ఉండాలని బీజేపీ నేత, పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి పేర్కొన్నారు.

ఆర్మీ చీఫ్‌పై ముందే భారత్ హెచ్చరిక

బంగ్లాదేశ్‌లో నిరసనకారులకు ఆర్మీ తెరవెనుకుండి మద్దతు పలికిందన్న మాటలు వినిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమాన్ వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. ఈ ఏడాది జూన్ 23న బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్‌గా ఆయన నియమితులయ్యారు. అయితే ఎంపికకు ముందే.. అతడి గురించి ప్రధాని షేక్ హసీనాను భారత్ హెచ్చరించినట్టు సమాచారం. అతడు చైనా అనుకూల వ్యక్తి. అతడితో జాగ్రత్తగా వ్యవహరించాలని భారత జాతీయ భద్రతా మండలికి చెందిన కొందరు ఉన్నతాధికారులు హసీనాను అప్రమత్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయినప్పటికీ హసీనా ప్రభుత్వం అతడి నియామకానికే మొగ్గుచూపింది.

న్యూయార్క్‌లోని బంగ్లా రాయబార కార్యాలయంపై దాడి

న్యూయార్క్‌లోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంపై కూడా కొందరు దాడికి పాల్పడ్డారు. కార్యాలయంలోకి చొచ్చుకుపోయి వస్తువులను ధ్వంసం చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహ్మాన్ చిత్రపటాన్ని తొలగించారు.

'పేదల బ్యాంకర్' మహమ్మద్ యూనస్

అమెరికాలోని వాండెర్‌బిల్ట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ చేసిన మహమ్మద్ యూనస్(83) బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పని చేశారు. 1983లో ఆయన ప్రారంభించిన గ్రామీణ్ బ్యాంకు బంగ్లాదేశ్ ఆర్థిక ప్రస్థానంలో కీలక భూమిక పోషించింది. గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు రూ.2 వేల నుంచి ఈ బ్యాంకు రుణాలు ఇచ్చింది. వేలాది కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ బ్యాంకు ఉపయోగపడింది. దీంతో యూనస్‌కు 'పేదల బ్యాంకర్'గా పేరు దక్కింది. ఆయన ప్రారంభించిన గ్రామీణ బ్యాంకు తరహాలో దాదాపు 100 దేశాల్లో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ప్రారంభమయ్యాయి. 2006లో యూనస్‌కు నోబెల్ బహుమతి దక్కింది. 2007లో బంగ్లాదేశ్ రాజకీయ నేతలపై విమర్శలు గుప్పించిన యూనస్ సొంత పార్టీని స్థాపిస్తానని ప్రకటించి తర్వాత వెనక్కుతగ్గారు. కాగా, ఆయనకు చెందిన గ్రామీణ్ టెలికం అనే కంపెనీలో కార్మిక సంక్షేమ నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. దీంతో జనవరిలో ఆయనను అరెస్టు చేయగా బెయిల్‌పై బయటకు వచ్చారు.

జైలు నుంచి విడుదలైన ఖలీదా

2018లో అవినీతి ఆరోపణలతో అరెస్టయి జైలు జీవితం గడుపుతున్న ఖలీదాను విడుదల చేయాల్సిందిగా దేశ అధ్యక్షుడు షహాబుద్దిన్ ఆదేశాలు ఇచ్చారు. షేక్ హసీనా రాజీనామా చేసిన గంటల్లోనే షహాబుద్దిన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఖలీదా జైలు నుంచి విడుదలయ్యారు. బుధవారం ఖలీదా నేతృత్వంలో బీఎన్‌పీ ర్యాలీ నిర్వహించనుంది. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహ్మాన్ సతీమణి అయిన ఖలీదా జియా 1991 - 96, 2001 - 06 వరకు రెండు పర్యాయాలు బంగ్లాదేశ్ ప్రధానిగా పని చేశారు. ఆ దేశ తొలి మహిళా ప్రధాని అయిన ఖలీదా.. మాజీ ప్రధాని షేక్ హసీనాతో సుదీర్ఘ రాజకీయ పోరాటం చేశారు.

మరికొన్ని రోజులు భారత్‌లోనే హసీనా!

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ నుంచి ఉన్నపళంగా తన సోదరి షేక్ రెహానాతో కలిసి భారత్‌కు వచ్చిన ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా లండన్ వెళ్లాలని భావిస్తున్నారు. రెహానా కూతురు తులిప్ సిద్దిఖ్ బ్రిటన్ పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. అయితే, హసీనాకు ఆశ్రయం కల్పించేందుకు యూకే ఆసక్తి చూపించడం లేదు. ఆశ్రయం కోరేందుకు, తాత్కాలిక శరణార్థిగా యూకేకు ప్రయాణించేందుకు అనుమతించే నిబంధన తమ దేశంలో లేదని యూకే హోం కార్యాలయ అధికార ప్రతినిధి చెప్పారు. అంతర్జాతీయ రక్షణ కోరేవారు ముందుగా ఏ సురక్షిత దేశానికి అయితే చేరుకున్నారో ఆ దేశాన్నే ఆశ్రయం కోరాలని తెలిపారు. బంగ్లాదేశ్‌లో జరిగిన హింసపై విచారణ జరిపితే, తమ దేశంలో హసీనాకు న్యాయపరంగా ఎలాంటి రక్షణ ఉండబోదని యూకే ప్రభుత్వం పరోక్షంగా చెప్పింది. దీంతో లండన్ వెళ్లాలనే నిర్ణయాన్ని హసీనా వాయిదా వేసుకునే అవకాశం ఉందని, కొన్ని రోజుల పాటు ఆమె భారత్‌లోనే ఉండే అవకాశం ఉంది.

హిందూ కవి పాటనే బంగ్లా నిరసనకారులకు స్ఫూర్తి

ఢాకా: బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలై, ప్రధానిని గద్దె దింపే వరకు కొనసాగిన నిరసనలకు ఒక హిందూ కవి రాసిన పాట కూడా స్ఫూర్తి నింపింది. దేశవిభజనకు ముందు బెంగాల్ గొప్పతనాన్ని, ఆ ప్రాంత వైభవాన్ని వర్ణిస్తూ ప్రముఖ బెంగాలీ కవి ద్విజేంద్రలాల్(డీఎల్) రాయ్ 'ధన ధాన్య పుష్ప భార' అనే పాటను రాశారు. జూలై 16 నుంచి బంగ్లాదేశ్‌లో మొదలైన ఆందోళనల్లో నిరసనకారులు ఈ పాటను ఆలపిస్తూ, వింటూ పాల్గొన్నారు. కాగా, ప్రస్తుత పశ్చిమ బెంగాల్‌లోని కృష్ణానగర్‌లో 1863 జూలై 19న డీఎల్ రాయ్ జన్మించారు. ఆయన రచించిన పాటలను 'ద్విజేంద్రగీతి'గా పిలుస్తారు.

ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా డ్రోన్ల దాడి

బీరూట్: లెబనాన్ సాయుధ గ్రూప్ హెజ్బొల్లా మంగళవారం డ్రోన్లు, రాకెట్లతో ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై విరుచుకుపడింది. అయితే గత వారం తమ టాప్ కమాండర్‌ను హత్య చేసినందుకు ఇంకా ప్రతీకారం తీర్చుకోలేదని ఆ సంస్థ వెల్లడించింది. లెబనాన్ దాడి వల్ల నహరియా నగరంలో పలువురు పౌరులు గాయపడ్డారని ఇజ్రాయెల్ తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని రెండు హెజ్బొల్లా స్థావరాలపై తమ వైమానిక దళం దాడి చేసిందని చెప్పింది. మరోవైపు లెబనాన్‌లోని మెఫడాన్ పట్టణంపై జరిగిన దాడిలో నలుగురు చనిపోయారని భద్రతా వర్గాలు తెలిపాయి. చనిపోయినవారిని హెజ్బొల్లా ఫైటర్లుగా భావిస్తున్నారు.

బీరుట్‌పై ఇజ్రాయెల్ యుద్ధ విమానాల గర్జన

బీరుట్: ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు మంగళవారం లెబనాన్ రాజధాని బీరుట్ మీదుగా దూసుకెళ్లాయి. లెబనాన్ హెజ్బొల్లా హెడ్ కీలక ప్రసంగం కోసం దేశ ప్రజలంతా టీవీల ముందు ఎదురుచూస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో లెబనాన్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. నగరంలోని ప్రజలంతా భయాందోళనలకు గురయ్యారు. ఇండ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. యుద్ధ విమానాలు మూడుమార్లు బీరుట్ మీదుగా వెళ్లాయి.

హమాస్ కొత్త చీఫ్ యాహ్యా సిన్వార్

గాజా, ఆగస్టు 6: గాజా స్ట్రిప్ చీఫ్ యాహ్యా సిన్వార్ హమాస్ కొత్త చీఫ్‌గా నియమితులయ్యారు. తమ ఉద్యమానికి సంబంధించి రాజకీయ బ్యూరో అధిపతిగా యాహ్యా సిన్వార్‌ను ఎంపిక చేసినట్టు ద 'ఇస్లామిక్ రెసిస్టెన్స్ మూవ్‌మెంట్ హమాస్' మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హమాస్ కొత్త చీఫ్ ఎంపిక జరిగిన కొద్ది నిమిషాల్లోనే హమాస్ సాయుధ బలగం 'ఎజ్జెడైన్ అల్ కస్సమ్' బ్రిగేడ్స్ ఇజ్రాయెల్ వైపు రాకెట్లను ప్రయోగించింది. వారం రోజుల క్రితం ఇజ్రాయెల్ నిఘా ఏజెంట్స్ దాడిలో హమాస్ చీఫ్ హానియా హతమైన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్, లెబనాన్‌లోని హెజ్బొల్లా ప్రకటించటంతో పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి.

20 ఏండ్లలో 10 మంది

ప్రజల నిరసనలతో పదవులు కోల్పోయిన దేశాధినేతలు

2024 ఆగస్టు: హసీనా రాజీనామా ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లపై బంగ్లాదేశ్‌లో నిరసనలు రేగడంతో ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి భారత్‌కు పారిపోయారు.

2022 : శ్రీలంక అధ్యక్షుడు రాజపక్సే ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవటంతో శ్రీలంకలో నిరసన జ్వాలలు చెలరేగాయి. అధ్యక్షుడు గోటబయ రాజపక్సే అధికార నివాసాన్ని నిరసనకారులు చుట్టుముట్టడంతో 2022 జూలైలో అధ్యక్ష పదవికి రాజీనామా చేసి దేశం విడిచి వెళ్లిపోయారు.

2017: రాబర్ట్ ముగాబే

జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే పాలనకు వ్యతిరేకంగా 2017 నవంబర్‌లో పెద్ద ఎత్తున నిరసనలు చోటుచేసుకున్నాయి. సైన్యం జోక్యం చేసుకొని ఆయన చేత బలవంతంగా రాజీనామా చేయించింది.

2018: అర్మేనియా ప్రధాని సార్గిసన్

ప్రధాని సెర్జ్ సార్గిసన్ పాలనకు 2018 ఏప్రిల్ 23న తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. నిరసనకారులు, సైన్యం చేతులు కలిపి.. పదవి నుంచి సెర్జ్ సార్గిసన్‌ను తప్పించారు.

2013: బల్గేరియా ప్రధాని బోరిసోవ్

పెరిగిన విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా బల్గేరియాలో నిరసనలు రేగాయి. 2013 ఫిబ్రవరిలో ప్రధాని బోరిసోవ్ రాజీనామా చేశారు.

2011: హోస్నీ ముబారక్

ఈజిప్ట్‌లో హోస్నీ ముబారక్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనకు దిగడంతో 2011 ఫిబ్రవరిలో ముబారక్ తప్పుకున్నారు.

2011: అబిదిన్ బెన్ అలీ

నిరుద్యోగం, ధరలకు వ్యతిరేకంగా ప్రజాగ్రహం పెల్లుబుకడంతో 2011 జనవరి 15న ట్యునీషియా అధ్యక్ష పదవికి అబిదిన్ బెన్ అలీ రాజీనామా చేసి సౌదీకి పారిపోయారు.

2009: ఐస్‌ల్యాండ్ ప్రధాని హార్డే

దేశ కరెన్సీ, బ్యాంకింగ్ వ్యవస్థ కుప్పకూలటంతో ప్రజలు ఆందోళనకు దిగడంతో ఐస్‌ల్యాండ్ ప్రధాని పదవికి హార్డే రాజీనామా చేశారు.

2006: నేపాల్ రాజు జ్ఞానేంద్ర

రాచరిక వ్యవస్థపై ప్రజాగ్రహం పెల్లుబుకడంతో నేపాల్ రాజు జ్ఞానేంద్ర గద్దె దిగాల్సి వచ్చింది.

2005: ఒమర్ కరామి

మాజీ ప్రధాని రఫిక్ హరిరి హత్యతో లెబనాన్‌లో నిరసనలు మిన్నంటడంతో ప్రధాని ఒమర్ కరామి రాజీనామా చేయాల్సి వచ్చింది.

బట్టలు సర్దుకునే టైమూ లేక!

- చివరి గంటలో హసీనా ఆగమాగం
- సూట్ కేసు వదిలిపెట్టి మరీ పరారీ
- తొలుత రాజీనామాకు విముఖం
- కొడుకు ఒత్తిడితో అయిష్టంగానే ఓకే
- జాతినుద్దేశించి చివరి ప్రసంగం చేద్దామన్నా కుదరని సమయం
- హసీనా విమానానికి గగనతలంలో రఫేల్ యుద్ధ విమానాల సెక్యూరిటీ

హసీనా నివాసాన్ని లూటీ చేసి వివిధ వస్తువులు తీసుకెళ్తున్న ప్రజలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): బంగ్లాదేశ్ ప్రధానమంత్రి అధికారిక నివాసం గణభవన్‌కు నిరసనకారుల లాంగ్ మార్చ్ సమీపిస్తున్న సమయంలో కూడా ప్రధాని పదవికి రాజీనామా చేయడానికి షేక్ హసీనా విముఖంగానే ఉన్నారట. అయితే, కుమారుడి ఒత్తిడితో ఎట్టకేలకు తలొగ్గిన ఆమె చివరకు రాజీనామాకు ఒప్పుకొన్నారని సమాచారం. రాజీనామా చేశాక ప్రధాని నివాసాన్ని ఖాళీ చేయాలనుకొన్న హసీనా.. తొలుత తన వ్యక్తిగత వస్తువులు, దుస్తులు అన్నీ సర్దుకొందామనుకొన్నారట. అయితే, అప్పటికే గణభవన్‌కు నిరసనకారుల బృందం అతి సమీపంలోకి రావడంతో తన సూట్‌కేసును కూడా వదిలిపెట్టి హసీనా దేశాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయారట. ఈ మేరకు బంగ్లాదేశ్‌కు చెందిన ప్రోథమ్ అలో సహా మరికొన్ని స్థానిక పత్రికలు పేర్కొన్నాయి.

ఉదయం నుంచి ఆగమాగం

నిరసనకారులపై పోలీసులు జరుపుతున్న కాల్పుల్లో మరణిస్తున్న విద్యార్థుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండటంతో ఆందోళనల తీవ్రత రెట్టింపైంది. దీంతో ఈ విషయాన్ని సోమవారం ఉదయం త్రివిధ దళాల ప్రధాన అధికారులు.. షేక్ హసీనా దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఆందోళనలను నియంత్రించడంలో విఫలమయ్యారంటూ హసీనా అంతర్గతంగా వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో.. పీఎం పదవికి రాజీనామా చేసి సైన్యానికి పాలనా పగ్గాలు అప్పగించాలంటూ ఐజీపీతో సహా అవామీ లీగ్ పార్టీ నాయకులు కూడా హసీనాకు సూచించారు. దీనికి ఆమె విముఖత వ్యక్తం చేశారు.

కుమారుడి ఒత్తిడితో..

అప్పటికే సమయం 10 గంటలు కావొస్తోంది. నిరసనకారుల లాంగ్ మార్చ్ పీఎం కార్యాలయం రూటులోకి వస్తున్నట్టు తెలుసుకొన్న సీనియర్ అధికారి ఒకరు.. పక్కగదిలో ఉన్న హసీనా సోదరి రెహానాకు పరిస్థితిని వివరించారు. ఆమె కూడా రాజీనామా చేయాలంటూ సూచించినా.. హసీనా వినలేదు. పరిస్థితి చేజారిపోతుండటంతో అమెరికాలో ఉంటున్న హసీనా కుమారుడు సజీబ్ అహ్మద్ వాజెద్ జోయ్‌ను అధికారులు రంగంలోకి దించారు. పరిస్థితిని వివరించారు. దీంతో ఫోన్‌లో హసీనాతో మాట్లాడిన సజీబ్.. రాజీనామాకు ఆమెను ఒప్పించారు.

45 నిమిషాల టైమ్

దేశాన్ని విడిచిపెట్టే కంటే ముందు జాతిజనులకు ప్రధానిగా తన చివరి ప్రసంగాన్ని ఇవ్వాలనుకొని రికార్డింగ్‌కు సిద్ధమయ్యారు. అయితే, గణభవన్‌కు నిరసనకారులు అత్యంత సమీపంగా వచ్చారన్న ఇంటెలిజెన్స్ రిపోర్ట్‌తో అది వీలు కాలేదు. 45 నిమిషాల్లోగా రాజీనామాకు సంబంధించిన పత్రాలు, ఇతరత్రా అధికారిక విధులను పూర్తిచేయాలని ఆర్మీ ఇచ్చిన సూచనల మేరకు వెంటనే ఆమె రాజీనామా కార్యక్రమాలను పూర్తిచేశారు.

రాష్ట్రపతి నివాసానికి.. అటు నుంచి బయటకు

గణభవన్ నుంచి రహస్య మార్గంలో బయటపడ్డ హసీనా.. రాష్ట్రపతి నిలయమైన బంగాభవన్‌లో తన రాజీనామా లేఖను సమర్పించారు. అనంతరం.. కట్టుదిట్టమైన భద్రత నడుమ మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఢాకాలోని మిలిటరీ ఎయిర్‌బేస్‌లో సైనిక విమానాన్ని ఎక్కారు.

భారత్ చుట్టూ అస్థిరత

- సంక్షోభంలో కూరుకుపోయిన సరిహద్దు దేశాలు
- ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థలకు ముప్పు
- ఇప్పటికే దేశాల ప్రజల మధ్య దెబ్బతిన్న సంబంధాలు
- భారత్ పెద్దన్న పాత్ర పోషించాలంటున్న పరిశీలకులు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 6: ఉపఖండంలోని దేశాల్లో నెలకొన్న అస్థిర పరిస్థితులు భారత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పాకిస్థాన్, శ్రీలంక, అఫ్గానిస్థాన్, మయన్మార్, నేపాల్ తాజాగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభాలు.. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా భారత్‌ను ప్రభావితం చేస్తున్నాయి. దేశం చుట్టూ నెలకొన్న పరిస్థితులు భారత విదేశాంగ విధానానికి సవాలు విసరడమే కాకుండా ఆర్థిక పరంగా కూడా నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈక్రమంలో భారత్ ఉపఖండంలో పెద్దన్న పాత్ర పోషించి శాంతి, సుస్థిరత కోసం కృషి చేయాలని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

- ***బంగ్లాదేశ్:*** *గత పదిహేనేండ్లలో బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ అనూహ్యంగా పుంజుకున్నది. నీరు, మానవ వనరులు సమృద్ధిగా ఉన్న బంగ్లాదేశ్‌లో పలు బహుళజాతి సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. దీంతో 1994-2023 మధ్య కాలంలో బంగ్లాదేశ్ 5.8% వృద్ధి రేటును నమోదుచేసింది. ఓ వైపు దేశం అభివృద్ధి దిశగా దూసుకుపోతుండగా.. అదే స్థాయిలో మతోన్మాదం, అరాచకత్వం పెనుముప్పుగా తయారయ్యాయి. చివరికి జమాతే ఇస్లామీ వంటి అతివాద శక్తులు ప్రజాస్వామికంగా ప్రభుత్వాన్ని కూలదోయడంలో సఫలమయ్యాయి.*
- ***శ్రీలంక:*** *కొవిడ్ ప్రభావంతో శ్రీలంక అతలాకుతలమైంది. నిత్యావసర ధరలు భారీగా పెరిగిపోగా అధిక ద్రవ్యోల్బణం, జీడీపీ పతనం ఆ దేశాన్ని తీవ్రంగా కుంగదీశాయి. దీంతో ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వంపై తిరుగుబాటుకు దిగారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడంలో మహింద రాజపక్స ప్రభుత్వం విఫలమైంది. దేశంలో తీవ్ర స్థాయిలో చెలరేగిన హింస, అస్థిరత నేపథ్యంలో ప్రధాని పదవికి రాజీనామా చేసిన రాజపక్స ట్రింకోమలై నౌకాశ్రయానికి పారిపోయి తలదాచుకున్నారు.*
- ***పాకిస్థాన్:*** *రెండేండ్ల క్రితం ఏప్రిల్‌లో పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీలో అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అర్ధంతరంగా తన పదవి నుంచి వైదొలిగారు. అప్పటినుంచి పాకిస్థాన్ తీవ్ర రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. దేశంలో నెలకొన్న ఆర్థిక అస్థిరత, సామాజిక, రాజకీయ సంక్షోభంతో పాక్ కోలుకోలేని స్థితికి దిగజారిపోయింది. దీంతో ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా ఉగ్రవాదం, తిరుగుబాట్లు పెచ్చుమీరుతున్నాయి.*
- ***అఫ్